



ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు

జిల్లా	ప్రాంతం	ఉష్ణోగ్రత (డిగ్రీల్లో)
వికారాబాద్	మోమిన్‌పేట్	14.9
రంగారెడ్డి	శేరిలింగంపల్లి	16.3
మేడ్చల్	మేడ్చల్	17.1



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

భూ సమస్యలను పరిష్కరించాలి

మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో తపాల, రైల్వే శాఖలకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లాలోని భూసమస్యల పరిషాకరం కోసం తహసీల్దార్లతో కలెక్టరేట్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాల, రైల్వే శాఖల భూముల్లో చేపడుతున్న నిర్మాణాలకు సంబంధించిన వివాదాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమన్వయంతో పరిష్కరించాలన్నారు. భూ భారతి, సాదాబైనామా, రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు. కోర్టులో ఉన్న వివాదాస్పద స్థలాకు సంబంధించి పిటిషన్లు దాఖలు చేయాలన్నారు. సమస్యాత్మక భూ వివాదాలను వెంటనే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు బరిరా ఫరీద్, ఆర్డీఓలు ఉపేందర్ రెడ్డి, శ్యాంప్రకాశ్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

బీసీ కులాలన్నీ ఏకం కావాలి

బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్

7

డీసీసీలు ఖరారు


వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ధారాసింగ్

ఎట్టకేలకు కాంగ్రెస్ అధిష్ఠానం డీసీసీ అధ్యక్షులను ఖరారు చేసింది. వికారాబాద్ జిల్లా బాధ్యతలను సీనియర్ నేత ధారాసింగ్‌కు అప్పగించగా, మేడ్చల్ జిల్లా అధ్యక్ష బాధ్యతలను వజ్రేశ్ యాదవ్ (జంగయ్య యాదవ్)కు అప్పగించింది. కాగా, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడి నియామకాన్ని మాత్రం పెండింగ్‌లో పెట్టింది. ఇక్కడ పోటీ తీవ్రంగా ఉండడంతో ఎవరికి పగ్గాలు ఇవ్వాలనేదానిపై అధిష్ఠానం ఎటూ తేల్చకోలేకపోయింది. రాష్ట్రంలో రెండు జిల్లాల అధ్యక్ష పదవులు పెండింగ్ పెట్టగా అందులో రంగారెడ్డి జిల్లా ఒకటి.

- మేడ్చల్-మల్కాజిగిరికి వజ్రేశ్ యాదవ్
- సామాజిక కూర్పు పాటించిన కాంగ్రెస్ అధిష్ఠానం
- రంగారెడ్డి జిల్లాలో వీడని ఉత్కంఠ
- మరికొంత కాలం తప్పని ఎదురుచూపులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)/ఘట్‌కేసర్/ తాండూరు : కాంగ్రెస్ అధిష్ఠానం పార్టీ జిల్లాల అధ్యక్షుల ఎంపికలో సామాజిక సమీకరణాలకు పెద్ద పీట వేసింది. మేడ్చల్ అధ్యక్షుడు వజ్రేశ్ యాదవ్ బీసీ సామాజిక వర్గానికి చెందినవారు.. కాగా వికారాబాద్ అధ్యక్షుడు ధారాసింగ్ ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారు. సామాజిక కూర్పుతో పాటు సీనియార్టీని కూడా పరిగణనలోకి తీసుకున్నారు. అయితే మహిళలకు కూడా సగం పదవులు ఇస్తామని చెప్పినప్పటికీ ఆ మేరకు డీసీసీ అధ్యక్షుల ఎంపిక జరగలేదు. ఇదిలా ఉంటే రంగారెడ్డి జిల్లా విషయంలో పార్టీ అధినాయకత్వం ఎటూ తేల్చుకోలేకపోతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ పోటీ తీవ్రంగా ఉండడంతో పాటు కొందరు పెద్దలు ఎంపిక చేసిన పేర్ల విషయంలో ఫిర్యాదులు ఎక్కువగా వచ్చినట్లు సమాచారం. దీంతో పార్టీ అధినాయకత్వం మరోసారి జాబితాను పరిశీలించి పేరు ఖరారు చేస్తామని పార్టీ నేతలకు చెప్పినట్లు

మిగతా 8వ పేజీలో...



ధారాసింగ్, వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు

వజ్రేశ్ యాదవ్, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు

ఎన్కేపల్లిలో గ్రీన్‌ఫీల్డ్ కిచెన్

అక్షయ పాత్ర ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం

రేపు భూమి పూజ చేయనున్న సీఎం రేవంత్ రెడ్డి

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్



ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్/కొడంగల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్) అందిస్తున్న అక్షయ పాత్ర ఫౌండేషన్ నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేందుకు ముందుకు వచ్చింది. మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు కొడంగల్ సమీపంలోని ఎన్కేపల్లిలో రెండెకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ కిచెన్ నిర్మాణం పనులకు రేపు (సోమవారం) సీఎం రేవంత్‌రెడ్డి భూమి పూజ నిర్వహించనున్నారు. జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం ఈనెల 14వ తేదీన జరగాల్సి ఉన్నా... 24వ తేదీకి వాయిదాపడింది. గ్రీన్‌ఫీల్డ్ కిచెన్‌లో వండిన భోజనాన్ని నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేయనున్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు : కలెక్టర్ ప్రతీక్‌జైన్

రేపు(24వ తేదీన) సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ పర్యటన నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శనివారం అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌తో కలిసి ఎన్కేపల్లిలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ సరఫరా, రెండు అంబులెన్స్‌లు, వైద్య సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. శానిటేషన్, బారికేడ్స్, మొబైల్ టాయిలెట్స్, తాగునీరు, స్టేజీ ఏర్పాట్లు, వీఐపీ పార్కింగ్ పూర్తి ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలన్నారు. అదే విధంగా కొడంగల్‌లో హెలీప్యాడ్‌ను పరిశీలించారు. ఆయనతో పాటు ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేశ్‌రెడ్డి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి రేణుకాదేవి, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారులు రవికుమార్, తహసీల్దార్ రాంబాబు పాల్గొన్నారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ పర్యటన నేపథ్యంలో ముందుగా నిర్ణయించిన దుద్యాల మండలం పోలెపల్లి, హకీంపేటలో ఎడ్యుకేషన్ హబ్, భూసేకరణ పరిశీలన కార్యక్రమాలు రద్దయ్యాయి.



శాంతి భద్రతలకే ప్రాధాన్యం

మహిళల భద్రత, పిల్లల రక్షణ ప్రధాన లక్ష్యం

స్థానిక పరిస్థితులకు అనుగుణంగా జిల్లాలో పోలీసింగ్

నూతన ఎస్పీ స్నేహ మెహ్రా

నారాయణరెడ్డి నుంచి బాధ్యతల స్వీకరణ

వికారాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు తొలి ప్రాధాన్యత ఇస్తామని ఎస్పీ స్నేహ మెహ్రా అన్నారు. శనివారం జిల్లా పోలీసు కేంద్ర కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న నారాయణరెడ్డి నుంచి ఆమె ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిస్థితులను, గత చరిత్రలను పరిశీలించి అందుకనుగుణంగా పోలీసింగ్‌లో అవసరమైన మార్పులు తీసుకొస్తామన్నారు. నేర నియంత్రణ, మహిళలు, పిల్లల భద్రత, రక్షణ తమ ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన

జిల్లాలో నేరాల సంఖ్యను తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు. అవసరమైతే నేరాల నియంత్రణకు హైదరాబాద్‌లో ఉపయోగించే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇక్కడా వినియోగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో స్థానిక సమస్యలను తెలుసుకుని, నేరాల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు మరింత ప్రశాంతంగా, భద్రతగా ఉండే వాతావరణాన్ని కల్పిస్తామని ఆమె భరోసా ఇచ్చారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు, సైబర్ నేరాల గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తామన్నారు. మహిళలు, పిల్లల భద్రత, రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, సిబ్బంది సంక్షేమానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లాలో పోలీసు వ్యవస్థను

మిగతా 8వ పేజీలో...

పంచాయతీ రిజర్వేషన్లు ఖరారు



రిజర్వేషన్లు ఖరారు చేస్తున్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ వాసుచంద్ర

వికారాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గ్రామ పంచాయతీ రిజర్వేషన్లను అధికారులు ఖరారు చేశారు. శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సుధీర్, డీపీవో జయసుధ సమక్షంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ వాసుచంద్ర, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ ఆధ్వర్యంలో రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు ఖరారు చేశారు. కాగా, మండలాల్లో ఎంపీడీవోల ఆధ్వర్యంలో వార్డు పదవుల రిజర్వేషన్లు ఖరారు చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ ప్రక్రియ రాత్రి వరకు కొనసాగింది. జిల్లాలో 594 పంచాయతీలు, 5,058 వార్డు సభ్యుల స్థానాలు ఉన్నాయి. ఈ స్థానాల్లో అన్ని కేటగిరిల్లో సగభాగం మహిళలకు కేటాయించారు. పంచాయతీల రిజర్వేషన్ల గెజిట్ నోటిఫికేషన్‌ను కలెక్టర్ ఆదివారం జారీ చేయనున్నట్లు తెలిసింది.

1,2,3.. డ్యాన్స్

మాస్టర్‌గా రాణిస్తున్న యువకుడు

Sunday Special



నృత్యం చేస్తున్న వెంకటేశ్

- బండలు పాలిషింగ్ చేస్తూ డ్యాన్స్‌లో రాణింపు
- పలువురి ప్రశంసలు అందుకుంటున్న వెంకటేశ్
- సినిమాల్లో సైడ్ డ్యాన్సర్‌గా గుర్తింపు
- కొరియోగ్రాఫర్‌గా ఎదగడమే లక్ష్యంగా ముందుకు
- పలు సత్కారాలు అందుకున్న తాండూరు యువకుడు

7

తోటి స్నేహితులు చేస్తున్న డ్యాన్స్ చూసి తాను కూడా డ్యాన్స్ చేయాలనుకున్నాడు. రాత్రివేళ నాపరాతి పాలిషింగ్ యూనిట్‌లో కార్మికుడిగా పని చేస్తూ పగటి వేళ తనకిష్టమైన డ్యాన్స్‌పై దృష్టి సారించాడు. తాండూరుకు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన బోయ వెంకటేశ్ అనే యువకుడు డ్యాన్స్ మాస్టర్‌గా రాణిస్తూ ప్రశంసలు అందుకుంటున్నాడు. తపనతో స్వతహాగా డ్యాన్స్ నేర్చుకొని ఎందరో యువకులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

- తాండూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి)



నాపరాతి పాలిషింగ్ చేస్తున్న వెంకటేశ్

నూతన లేబర్ కోడ్‌లతో తీవ్ర అన్యాయం



ఒంటికాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న కార్మికులు

ఘట్‌కేసర్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త లేబర్ కోడ్‌లు కార్మికులను ఆధునిక బానిసలుగా మారుస్తుందని, వీటితో తీవ్ర అన్యాయం జరుగుతుందని సీఐటీయూ జిల్లా నాయకుడు యాదయ్య విమర్శించారు. ఈ కోడ్‌ల అమలుకు జారీ చేసిన నోటిఫికేషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం ఘట్‌కేసర్‌లోని అవుటర్ చౌరస్తాలోని కూలీల అడ్డా వద్ద పలువురు కార్మికులతో కలిసి ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేయడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వాటి స్థానంలో కార్పొరేట్ యాజమాన్యాలకు లబ్ధి చేకూర్చేలా ఈ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. దేశంలో గతంలో నెలకొల్పిన ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించిన సంస్థలను కారుచౌకగా అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నదని ఆరోపించారు. కేంద్ర వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మికలోకం సంఘటితమై పోరాటాను ఉధృతం చేసి తమ హక్కులను సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో సబిత, నాగరాజు, శ్రీనివాస్, రాజిరెడ్డి, సత్తమ్మ, ఎల్లమ్మ, సురేశ్, అచ్చయ్య పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు సంఘటితంగా సాధించాలి

పరిగిలో బీసీ ఐక్య వేదిక సంఘం నాయకులు



పరిగిలో సమావేశమైన బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు

పరిగి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరంగా చట్టసభల్లో బీసీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్‌లు సాధించే వరకు సంఘటితంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు తెలిపారు. శనివారం పరిగిలోని స్వాగత్ హోటల్‌లో బీసీ సంఘాల ఐక్య వేదిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర జేఏసీ కన్వీనర్ హన్మంత్ ముదిరాజ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.లాల్‌కృష్ణప్రసాద్, డాక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బి.జగన్మోహన్, బీజేపీ రాష్ట్ర కార్యదరి మారుతికిరణ్, ఈజీఎస్ రాష్ట్ర మాజీ కౌన్సిల్ మెంబర్ కంకల్ వెంకటేశ్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ బీసీ హక్కులు ఎవరో భిక్ష పెట్టింది కాదన్నారు. హక్కులకోసం గ్రామ,గ్రామాన ఉద్యమ నిర్మాణం చేపట్టబోతున్నామని తెలిపారు. జనాభా ప్రకారం హక్కుల సాధన కోసం బీసీలంతా ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. సంఘటితంగా ఉద్యమిస్తే రాజ్యాంగ ఫలాలు సాధించుకోవచ్చన్నారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీల హక్కుల పట్ల చిత్తశుద్ధితో లేవన్నారు. జనాభా 56 శాతం ఉన్న బీసీలకు రాజ్యాధికారం దక్కకుండా అగ్రకులాలు మోసం చేస్తూనే ఉన్నాయన్నారు. త్వరలో పరిగిలో లక్ష మందితో సభను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్‌ల సాధనపై చర్చ జరుగుతుందని, ఇది ఇంతటితో ఆగకుండా ఉద్యమంగా మార్చాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో పరిగిలో బీసీ ఎమ్మెల్యేను గెలిపించుకుందామన్నారు. అందుకోసం అన్ని రాజకీయ పార్టీల్లోని బీసీలంతా పార్టీలకతీతంగా వచ్చి ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు ఆనంద్‌గౌడ్, సదానందం, కావలి సత్యనారాయణ, కె.రామకృష్ణధన్వేశర్, జింకల యాదయ్య, బుచ్చన్న, శ్రీశైలం, చెర్క సత్తయ్య, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో

దుద్యాల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో రేణుకాదేవి సూచించారు. దుద్యాల్ మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన మండల స్థాయి ప్రాథమిక పాఠశాలల సముదాయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో భాష గణిత సామర్థ్యాలను పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అంతకుముందు మండలంలోని పోలెపల్లి శ్రీ రేణుక ఎల్లమ్మ దేవతను దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో విజయరామారావు, సూపరింటెండెంట్ రాజేశ్వర్ ప్రసాద్, సీఆర్‌పీ రాందాస్, టీచర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత

ఆమనగల్లు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):బాల్య వివాహాల నిర్మూలనకు ప్రభుత్వాలు చేస్తున్న కృషిలో ప్రజలు భాగస్వాం కావాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. బాల్య వివాహాల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శనివారం ఆమనగల్లులోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద బాల్య వివాహ్ ముక్త్ భారత్ ప్రచార రథాన్ని సీడీపీవో శాంతిరేఖ, మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్‌లతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాల నిర్మూలనకు ఐసీడీఎస్, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజాచైతన్య కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు ముందుండాలన్నారు. మానవ అక్రమ రవాణా నిరోధం, పౌష్టికాహార విలువలు, డ్రగ్స్‌తో అనర్థాల గూర్చి అంగన్‌వాడీలు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీటీ వినోద్, ఐసీడీఎస్ సూపర్వైజర్ అనిత, సిబ్బంది దేవేందర్‌చారి, శ్రీలత, మోహినుద్దీన్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, కాంగ్రెస్ ఆదివాసి రాష్ట్ర నాయకుడు కృష్ణానాయక్, బాబ తదితరులు పాల్గొన్నారు.


ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే సంకల్పం

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల, కల్వకుర్తి, వెల్దండ మండలాల్లో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నాయకులు, అధికారులతో కలిసి ఇందిర మహిళా శక్తి చీరలను, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆడబిడ్డలకు ప్రభుత్వం చీరలు పంపిణీ చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్, డీసీసీ అధికార ప్రతినిధి జి.శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ గీతనర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, పర్వతరెడ్డి, ఆనంద్‌కుమార్, భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్, మోతీలాల్, వెంకటయ్య, విజయ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

బోర్డు తిప్పేసిన అజయ్ జ్యువెలర్స్



కులకచర్లలోని మూసి ఉన్న జ్యువెలర్స్

కులకచర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజస్థానీ మార్వాడీలు కస్టమర్ల బంగారం తాకట్టు పెట్టుకొని వడ్డీలకు అప్పులిస్తూ, నమ్మకంగా ఉం టున్నట్టు నటించి అధిక వడ్డీల ఆశచూపి కొందరి వద్ద అప్పు తీసుకొని బోర్డు తిప్పేయడం, రాత్రికి రాత్రి కుటుంబాలతో సహా ఉడాయించడం పరిపాటిగా మారింది. తాజాగా కులకచర్లలోని అజయ్ జ్యువెలర్స్ షాపు యజమాని బోర్డు తిప్పేశాడు. ఈ ప్రాంతంలో ఇలాంటి సంఘటన ఇటీవల నాలుగోది. ఐదేళ్ల క్రితం జ్యువెలర్స్ నిర్వహించిన రాజస్థాన్ రఘువీర్ లక్షలాది రూపాయలు విలువైన బంగారాన్ని తాకట్టు పెట్టుకొని రాత్రికి రాత్రే పారిపోయాడు. మూడేళ్ల క్రితం చౌడాపూర్‌లో మోహన్ జ్యువెలర్స్ షాపు యజమాని తాకట్టు బంగారం, రూ.లక్షల్లో అప్పు చేసి బిచానా ఎత్తేశాడు. రెండేళ్ల క్రితం కులకచర్లలో మధు హార్డ్‌వేర్ షాపు యజమాని స్థానికుల వద్ద అప్పు తీసుకొని రూ.కోట్లు కొల్లగొట్టి ఉడాయించాడు. అప్పట్లోనే వీరి మోసాలపై కేసులు నమోదైనా బాధితులకు నేటికీ న్యాయం జరగలేదు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

ఉద్యమకారులను గుర్తించండి


కోదండ రాంను సన్మానిస్తున్న వెంకట్ రాంరెడ్డి

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయించాలని ఉద్యమకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.వెంకట్‌రాంరెడ్డి కోరారు. శనివారం ఉద్యమకారుల సమన్వయ కమిటీ చైర్మన్ కోదండరాంకు హైదరాబాద్‌లో వినతి పత్రాన్ని ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమకారుల త్యాగం, శ్రమ మరిచిపోలేనిదని, కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే అండగా నిలిచి ఆదుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారుల సంక్షేమ సంఘం సభ్యులు టీజీ శ్రీనివాస్, కళ్లెం నర్సింహారెడ్డి, ఆంజనేయులు, ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి

మర్పల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎన్నికలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ప్రధానోపాధ్యాయుడు రామేశ్వర్ అన్నారు. శనివారం మర్పల్లి జిల్లా పరిషత్ ఉర్దూ మీడియం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎన్నికలపై మాక్ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల బరిలో అభ్యర్థులు, నామినేషన్‌లు, ప్రచారం, ఎన్నికల అధికారుల గురించి విద్యార్థులకు వివరించారు. 170 మంది విద్యార్థులు పోలింగ్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అలీమొద్దీన్, నవీన్, జంగయ్య, అయేషా, స్రవంతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పల్నాటి నరేశ్

జాగృతి అధ్యక్షురాలు కవితను
విమర్శించే స్థాయి బీఆర్ఎస్‌కు లేదు

మహేశ్వరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితను విమర్శించే స్థాయి మహేశ్వరం బీఆర్ఎస్ నాయకులకు లేదని జాగృతి నాయకుడు, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పల్నాటి నరేశ్ అన్నారు. జాగృతి జనం బాటలో భాగంగా రెండు రోజులు మహేశ్వరం నియోజకవర్గంలో పర్యటించిన కవిత ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై, కొందరు భూకబ్జాదారులపై మాట్లాడారన్నారు. ఇది సహించని కొందరు బీఆర్ఎస్ నాయకులు కవితపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం తగదన్నారు. నరేశ్ శనివారం మహేశ్వరంలో విలేకరులతో మాట్లాడారు. కవిత చేసిన విమర్శలకు బీఆర్ఎస్ నాయకులు ఎందుకు స్పందిస్తున్నారని ప్రశ్నించారు. భూముల కబ్జాలు చేసిన బీఆర్ఎస్ నాయకులకు కవితను విమర్శంచే హక్కు లేదన్నారు. ఇకపై కవితను ఎవరు విమర్శించినా సహించేది లేదన్నారు. కార్యక్రమంలో జాగృతి నాయకులు వెంకటేష్, శ్రీకాంత్, సాయికిరణ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్..
అన్నీ బహుజన వ్యతిరేక పార్టీలే



మాట్లాడుతున్న విశారదన్ మహరాజ్

షాబాద్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అన్నీ బహుజనులకు యాంటీ పార్టీలేనని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు రిజర్వేషన్ల కోసం సంఘటితమై పోరాడాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ విశారదన్ మహరాజ్, మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు అన్నారు. శనివారం షాబాద్‌లో బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష 42వ రోజుకు చేరింది. శనివారం వారు మద్దతు తెలిపారు. చదువు, ఉద్యోగాల కోసం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు పోరాటాలు చేస్తుండటం బాధాకరం అన్నారు. అగ్రవర్ణాల ఆధిపత్యంతో బహుజనులు అనగారిపోయారన్నారు. నాడు పండుగ సాయన్న, మాదిగ బిడ్డ తుప్పలయ్య రెడ్డి ఆధిపత్యంపై పోరాటం చేశారని గుర్తుచేశారు. బహుజనుల తలరాత రాసే పదవుల్లో ఉన్నది మొత్తం రెడ్డిలే అన్నారు. అనగారిన వర్గాలకు కీలక పదవులు దక్కడం లేదన్నారు. నాయకత్వానికి బీసీలు ముందుకు రావాలని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు రాజకీయ ఉన్నత పదవుల్లో కూర్చోవాలన్నారు. కార్యక్రమంలో రిజర్వేషన్ సాధన సమితి సభ్యులు అంజనేయులు, రవీందర్, రాజేందర్ గౌడ్, పాండు, శ్రీనివాస్‌గౌడ్, రాపోల్ నర్సింహులు, చేవెళ్ల స్వామి, రాము, కమ్మరి శ్రీను, రమేష్‌యాదవ్, ఒగ్గు రాజు, మల్లయ్య, చంద్రయ్య, మాసయ్య, లింగం, వెంకటయ్య, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో పెరుగుతున్న క్యాన్సర్ బాధితులు

శామీర్‌పేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రతీ వంద మందిలో పది మంది క్యాన్సర్ బారిన పడి యాతన అనుభవిస్తున్నారని స్త్రీల(గైనకాలజీ) స్పెషలిస్టు డాక్టర్లు పోశాల ప్రజ్ఞకీర్తి, కీర్తణ తెలిపారు. శనివారం అలియాబాద్ చౌరస్తాలోని దక్ష జూనియర్ కళాశాలలో ఇంటర్, హైస్కూల్ విద్యార్థులకు లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం మెడికల్ కాలేజీ, ఆస్పత్రుల ఆధ్వర్యంలో సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ 7 నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు క్యాన్సర్ బారినపడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. 9 నుంచి 14ఏళ్ల లోపు పిల్లలు రెండు డోసుల వ్యాక్సిన్ వేసుకుంటే క్యాన్సర్‌ను అరికట్టొచ్చని తెలిపారు. అలాగే 15ఏళ్ల పైబడిన వారు కూడా వ్యాక్సిన్‌ను తీసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల చైర్మన్ శివశంకర్, డైరెక్టర్ మల్లేశ్, ఆర్వీఎం ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ ఎం.లక్ష్మణ్, సహాయ మేనేజర్ హేమశ్రీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కన్నతల్లి లాంటిది



గుట్ట రాజును కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


షాద్‌నగర్ అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించి, సర్వతోముఖాభివృద్ధికి పాటుపడిన కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్తకు కన్న తల్లిలాంటిదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గుట్ట రాజు తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే శంకర్ రాజుకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ.. తనకు ముఖ్య అనుచరుల్లో ఒకడుగా ఉండి, చిన్న చిన్న కారణాలతో బీఆర్ఎస్‌లోకి వెళ్లిన రాజు తిరిగి కాంగ్రెస్‌లోకి సంతోషంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్ స్వార్థ రాజకీయాలకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తట్టుకోలేరని, సొంత బిడ్డనే పార్టీ నుంచి గెంటేసిన పార్టీ అని అన్నారు. ఆ పార్టీలో ఉండి ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని, అందర్నీ ఆదరించి, అభిమానించే కాంగ్రెస్‌లోకి రావాలని శంకర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో షాద్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జి.బాల్‌రాజ్‌గౌడ్, మండలాధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కొందుర్గు విండో చైర్మన్ దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎ.కృష్ణారెడ్డి, మొగిలిగిద్ద గ్రామ నాయకులు కోట్ల శ్రీశైలం, దయాసాగర్, నారాయణరెడ్డి, పఠాన్‌పాషా, జి.శ్యాంసుందర్, ఆర్. మల్లేష్, సురేందర్, భరత్, శివకుమార్ పాల్గొన్నారు.

దేశ వ్యాప్తంగా ఒకే ఒక్క ఓటు ఉండాలి

దేశంలో ఎక్కడైనా ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండేలా ఎన్నికల సంఘం శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే శంకర్ డిమాండ్ చేశారు. క్యాంపు ఆఫీసులో ఓట్ చోర్-గద్దీ చోడ్ అనే కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఓట్ చోర్‌పై సంతకాల సేకరణ ప్రారంభించారు.

విషాదం మిగిల్చిన విహార యాత్ర

- వండర్‌లాలో ఈత కొడుతూ విద్యార్థికి అస్వస్థత
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



శివకుమార్(ఫైల్)

ఆదిభట్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రావిర్యాలలోని వండర్‌లాకు విహార యాత్రకు వచ్చిన విద్యార్థులకు విషాదం మిగిలింది. ఈ ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. హైదరాబాద్‌లోని అమీర్‌పేటలోని సిస్టర్ నివేదిత స్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులు శుక్రవారం విహార యాత్రకు వండర్‌లాకు వెళ్లారు. మధ్యాహ్నం 2 గంటలకు భోజనం చేశాక స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతున్న విద్యార్థుల్లో వేశంగి శివకుమార్(13) తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో పాఠశాల యాజమాన్యం ఎల్బీ నగర్‌లోని గ్లీన్ గిల్స్ అవేర్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శివకుమార్ మృతిచెందాడు. బాలుడి తండ్రి సునీల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆదిభట్ల సీఐ రవి కుమార్ తెలిపారు.

శంషాబాద్ ప్రభుత్వాస్పత్రికి భూమి పూజ



ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. శంషాబాద్ పట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి కేటాయించిన భూమిలో భవన నిర్మాణం కోసం ఆయన స్థానిక నాయకులతో కలసి శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థానికులకు ఇచ్చిన హామీ నెరవేర్చేందుకు రూ.5కోట్ల హుడా నిధులు వెచ్చించి ప్రభుత్వ ఆసుపత్రికి అన్ని సౌకర్యాలతో సొంత భవనాన్ని నిర్మిస్తున్నట్టు తెలిపారు. శంషాబాద్‌లో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మిస్తే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కూడా మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుందని ప్రకాశ్‌గౌడ్ చెప్పారు. అలాగే ఐఆర్‌జీఎస్ పథకానికి చెందిన 1.95 లక్షలు వెచ్చించి ఎయిర్‌పోర్టు నిర్వాసిత కాలనీ నుంచి కొత్వాల్‌గూడ వరకు రోడ్డు నిర్మిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ గణేశ్‌గుప్తా, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్‌యాదవ్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

డిసెంబరు 10, 11 తేదీల్లో...
జాతీయ మల్టీ డిసిప్లినరీ సదస్సు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

చేవెళ్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వచ్చే డిసెంబరు 10, 11 తేదీల్లో చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరిశోధన వాతావరణం, అభివృద్ధి, అకడమిక్ నెట్వర్క్ బలోపేతం, ఎస్డీజీ-16 లక్ష్య సాధనలో భాగంగా రెండు రోజుల జాతీయ మల్టీ డిసిప్లినరీ సదస్సు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత తెలిపారు. సదస్సు బ్రోచర్లను శనివారం విడుదల చేసిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ జాతీయ సదస్సును తెలంగాణ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్, జాతీయ సంస్థలు స్పాన్సర్ చేస్తున్నాయన్నారు. 'శాంతియువత సమాజం, న్యాయబద్ధ పాలన, సమ గ్రాభివృద్ధి-సవాళ్లు..' అనే అంశాలపై నిపుణులు చర్చిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.రమేశ్‌కుమార్, సదస్సు కన్వీనర్ ఎంఏ.మాలిక, సహ కన్వీనర్ ఎ.కవిత తదితరులు పాల్గొన్నారు.

పంట నేలరాలి.. గడ్డి నీట నాని...

- గుదిబండగా మారిన వరి కోతలు
- హార్వెస్టర్లతో నూర్పిడి చేయిస్తే పొలంలోనే రాలుతున్న వడ్లు
- తుఫాన్ ప్రభావంతో నేలవాలి తడిసిన గడ్డి
- పశుగ్రాసం కొనక తప్పని పరిస్థితి



యాచారంలో వరి కోస్తున్న హార్వెస్టర్

యాచారం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వరి కోతలు రైతులకు గుదిబండంగా మారాయి. ఇటీవలి మొంథా తుఫాన్ కారణంగా మండలంలోని వివిధ గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది. దీంతో కూలీలతో కోయించినా, హార్వెస్టర్లతో కోయించినా వడ్లు నేల రాలుతున్నాయి. వడ్లు, గడ్డి పాడయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

రేట్లు పెంచిన హార్వెస్టర్ల నిర్వాహకులు

స్థానికంగా హార్వెస్టర్లు లేక ఇతర ప్రాంతాల నుంచి రప్పించి వరి కోతలు సాగిస్తున్నారు. అన్ని గ్రామాల్లో ఒకేసారి పంట కోతకు రావడంతో హార్వెస్టర్లకు డిమాండ్ పెరిగింది. దీంతో గంటకు రూ.3వేలు,పొలంలో నీరుంటే గంటకు రూ.3,500 తీసుకుంటున్నారు. రెండు ఎకరాల్లో కోతకు రెండు గంటలకు రూ.7వేలు చెల్లిస్తున్నారు. కూలీలకైతే ఒక్క మనిషికి రోజుకు రూ.400 కూలి ఇస్తున్నారు. మనుషులతో రెండెకరాల కోతకు రూ.పది వేల ఖర్చు అవుతోందని రైతులు చెబుతున్నారు.

చేతికందని ఎండు గడ్డి

హార్వెస్టర్లతో వరి కోయిస్తే పశుగ్రాసం చేతికందదు. పంట మధ్య వరకే మిషన్ కట్ చేస్తుండటంతో పొలంలోనే గడ్డి మొత్తం పోతుంది. మిషన్ కోసిన చోట్ల సాళ్లలో పడిన గడ్డిని సైతం మోపు కట్టేందుకు వీలులేక పొలంలోనే వదిలేయాల్సి వస్తోంది. పంట నేలవాలి నానడంతో కూలీలతో కోయించినా గడ్డి అంతా పొల్లుగా మారుతోంది. ఎలా కోయించినా పశుగ్రాసం అందడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువుల కోసం వేలు వెచ్చించి వేరే చోట గడ్డి కొనక తప్పడం లేదని రైతులు చెబుతున్నారు. వరి గడ్డి కొరతతో ఈ సారి రేటు పెరుగుతుందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హాలియా ప్రాంతాల నుంచి వరి గడ్డి దిగుమతి చేసుకుంటున్నామని చెబుతున్నారు.

వరి రైతుల తిప్పలు

రెండెకరాల కోతకు రూ.7వేల ఖర్చయింది



నా రెండెకరాల చేను కోతకు హార్వెస్టర్‌కు రూ.7వేలు తీసుకున్నారు. యంత్రం పెట్టి కోయిస్తే గడ్డి చేతికందలేదు. వర్షానికి నేలవాలి బాగా నానడంతో గడ్డి చేతికందకుండా యంత్రంలోనే నుజ్జునుజ్జయింది. పాడి పశువులకు, ఎడ్లకు వరి గ్రాసం కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. వర్షాలతో పంటకు తీవ్ర నష్టం జరిగింది.

\- గణేశ్, రైతు, మేడిపల్లి

1, 2, 3.. డ్యాన్స్

మాస్టర్‌గా రాణిస్తున్న యువకుడు



బెస్ట్ చాంపియన్‌షిప్ వరల్డ్ రికార్డు అవార్డును అందుకుంటున్న వెంకటేశ్(ఫైల్)

తాండూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా దేవనికొండకు చెందిన నర్సన్న, శ్యామలమ్మలు బతుకు దెరువు నిమిత్తం కొన్నేళ్ల క్రితం తాండూరుకు వలస వచ్చారు. వారి కుమారుడు బోయ వెంకటేశ్‌కు చిన్ననాటి నుంచి పోలీసు కావాలన్న కోరిక ఉండేది. ఓ సారి ఎన్‌సీసీ క్యాంప్‌కు వెళ్లిన సమయంలో తోటి విద్యార్థుల అద్భుతమైన డ్యాన్స్‌ను చూసి తానూ డ్యాన్సర్‌గా మారాలనుకున్నాడు. అప్పటి నుంచి సినిమా పాటలు వింటూ సొంతంగా వినాయక ఉత్సవాల్లో, వివాహాల్లో, పాఠశాలల్లో, కార్యక్రమాల్లో డాన్స్ చేస్తూ ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. అలా అంచెలంచెలుగా ఎదిగి డాన్స్ మాస్టర్‌గా పలు పురస్కారాలను అందుకున్నాడు. వెంకటేశ్ ప్రాథమిక విద్యను కర్నూలులో అభ్యసించి, ఇంటర్, డిగ్రీని తాండూరులో పూర్తి చేశాడు.

పలు అవార్డులు.. సత్కారాలు

తాండూరులో స్వస్తిక్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన డాన్స్ ప్రోగ్రాంలో నాట్య కళా పురస్కారం, ఇంద్రధనస్సు కళాకారుల బోనాల సంబురాలకు తీసుకెళ్లగా తెలంగాణ ఫోక్ డాన్స్ మాస్టర్‌గా పురస్కారం, ఉజ్వల సామాజిక స్వచ్ఛంద సేవా వారు నిర్వహించిన బంగారు తెలంగాణ-బోనాల సంబరాల్లో అభినందన సత్కారం, వారధి, దాశరథి, మ్యాజిక్ అండ్ ఫెస్టివల్ కార్యక్రమంలో నాట్య శిరోమణి అవార్డు, నాట్య తరంగిణి అవార్డు, స్వర మాధురి కార్యక్రమంలో స్వతంత్ర్య భారతికి-నృత్యహారతి కార్యక్రమంలో జాతీయ సమాఖ్య పురస్కారాలను అందుకున్నాడు. ఇటీవల హైదరాబాద్‌లో బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ల్యాంగ్వేజ్ కల్చరల్ తెలంగాణ ప్రతినిధి మామిడి హరికృష్ణ నుంచి బెస్ట్ చాంపియన్ వరల్డ్ రికార్డు అవార్డును 2019లో త్యాగరాయ గానసభలో అందుకున్నారు.

సినిమాల్లో సైడ్ డ్యాన్సర్‌గా..

నక్షత్రం సినిమాలో 'లాహిరి లాహిరి లబ్బరు బొమ్మ..' పాటకు గణేశ్ మాస్టర్ కొరియోగ్రఫీలో సైడ్ డ్యాన్సర్‌గా వెంకటేశ్ రాణించాడు. శేఖర్ మాస్టర్ సహకారంతో జర్నీ సాంగ్‌లో, రక్తచరిత్ర, ది రియల్ స్టోరీ సినిమాల్లో సైడ్ డ్యాన్సర్‌గా పని చేశాడు. ఉస్మానియా యూనివర్సిటీలో డ్యాన్స్ పోటీలకు వెళ్లగా స్నేహితుల ద్వారా ఢీ-9 జోడీలో సైడ్ డ్యాన్సర్‌గా డాన్స్ చేసి ప్రతిభను నిరూపించుకున్నాడు. మాస్టర్ సాయితేజ శిక్షణలో తన కళకు మెరుగులు దిద్దుకున్నాడు.

డిగ్రీ చదువుతున్న రోజుల్లో...

ఒక పూట తినడానికి కూడా తిండి కూడా దొరకని టైంలో తాండూరుకు వలస వచ్చాం. డిగ్రీ చదువుతున్న సమయంలో సిద్దార్థ డిగ్రీ కాలేజీల్లో ఫేర్వెల్ పార్టీకి చేసిన గ్రూప్ డాన్స్ నా జీవితాన్ని మలుపు తిప్పింది. కాలేజీ నుంచి ఓ యూలో డాన్స్ పోటీలకు వెళ్లగా అక్కడ ఒక స్నేహితుడి ద్వారా సైడ్ డ్యాన్సర్‌గా అవకాశం లభించింది. ఢీ-9లో జోడీలో సైడ్ డ్యాన్సర్‌గా తొలి అడుగు పడింది. తాండూరు చౌరస్తాలో 100 మంది విద్యార్థులతో డాన్స్ చేయించాను. నా వద్ద డ్యాన్స్ ప్రాక్టీస్ చేసిన వాళ్లు డ్యాన్స్ మాస్టర్‌లుగా ఎదిగారు.

\- వెంకటేశ్, డ్యాన్స్ మాస్టర్, తాండూరు

బీసీ కులాలన్నీ ఏకం కావాలి



ఏకగ్రీవంగా ఎన్నికైన వారిని సన్మానిస్తున్న బీసీ సంఘాల నాయకులు

వికారాబాద్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బీసీ కులాలన్నీ ఏకం కావాల్సిన సమయమొచ్చిందని, 42శాతం రిజర్వేషన్ సాధించేందుకు పోరాటాలు చేయాలని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. శనివారం వికారాబాద్ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో బీసీ కుల సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ, జిల్లా బీసీ కుల సంఘాల జేఏసీని ఎన్నుకున్నారు. కార్యాచరణ కమిటీ చైర్మన్‌గా గుడిసె లక్ష్మణ్, కన్వీనర్ యాదగిరియాదవ్‌లను ఎన్నుకున్నారు. పట్టణ కమిటీ అధ్యక్షుడిగా బీఆర్ శేఖర్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణగౌడ్, ఉపాధ్యక్షులు విఠల్, రిటైర్డ్ టీచర్ ఉమాశేఖర్, కార్యదర్శులు విజయప్ప, నారాయణ, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీలుగా కోడి లక్ష్మణ్, వెంకటేశ్, సలహాదారులు రమేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ఎల్లయ్య, బీసీ సంఘాల నాయకులను ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లకు పనిచేయాలని, ఉద్యోగ, విద్య అవకాశాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ నాగేందర్‌గౌడ్, మాజీ ఎంపీపీ నర్సిములు, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్, ఆంజనేయులు, వెంకటదాసు, అంజయ్య, శేఖర్, రమేష్‌గౌడ్, శంకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ టోర్నీ విజేత తాండూరు జట్టు



ట్రోఫీ అందుకుంటున్న తాండూరు క్రికెట్ టీం

తాండూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 14 జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీలో తాండూరు జట్టు విజేతగా నిలిచింది. శనివారం పరిగి మినీ స్టేడియంలో తాండూరు-వికారాబాద్‌ల మధ్య ఫైనల్‌మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న వికారాబాద్ 10 ఓవర్ల మ్యాచ్‌లో 9 వికెట్ల నష్టానికి 67 పరుగులు చేసింది. అనంతరం తాండూరు జట్టు మరో 3ఓవర్లు మిగిలి ఉండగానే 2వికెట్లు కోల్పోయి 68 పరుగులు చేసి విజేతగా నిలిచింది. ఈ టోర్నీలో తాండూరు జట్టు కెప్టెన్, కీపర్ కనవ్‌పండిట్ ఆల్ రౌండర్ రిస్విత్ చంద్ర బౌలర్లు అభిలాశ్, అర్జవ్‌లు ఉత్తమ ప్రతిభను కనబరిచి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ టోర్నీలో కనవ్ పండిట్ 94 పరుగులు, రిష్విత్ చంద్ర 77పరుగులతో టాప్ స్కోరర్లుగా నిలిచారు. టోర్నీలో అభిలాష్ 10 వికెట్లు తీశాడు. జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి అనంతయ్య, కృష్ణమూర్తి, పీఈటీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి

చేవెళ్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల నియోజకవర్గంలోని గురుకుల పాఠశాలలకు తక్షణమే సొంత భవనాలు నిర్మించాలని బీజేపీ చేవెళ్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎ.అనంతరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 2016లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలలను ప్రభుత్వం ప్రారంభించనప్పటికీ పక్కా భవనాలు నిర్మించక అద్దె భవనాల్లోనే చదువు బోధిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం సొంత భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. చీర శ్రీనివాస్, మహేందర్, పత్తి సత్యనారాయణ, బండారి చంద్రశేఖర్‌రెడ్డి, అభిశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ



వెనక నుంచి బస్సును ఢీకొన్న లారీ

పూడూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సును ఓ లారీ వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు ముప్పు తప్పింది. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. శనివారం పరిగి డిపో బస్సు 34మందితో బీజాపూర్ జాతీయ రహదారిపై పరిగి నుంచి మెహిదిపట్నం వెళ్తోంది. ఈ క్రమంలో చిన్నబండతండా గేటు వద్ద వెనక నుంచి వచ్చిన లారీ.. బస్సును ఢీకొట్టింది. అప్రమత్తమైన బస్సు డ్రైవర్ బస్సును రోడ్డుపక్కన నిలిపాడు. ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదంతో బస్సులో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. బస్సు వెనక భాగం డ్యామేజ్ అయింది. అనంతరం స్థానికులు లారీని పోలీసు స్టేషన్‌కు తరలించారు. చేవెళ్ల-మిర్జాగూడ రూట్లో ఇదే హైవేపై ఆర్టీసీ బస్సు-కంకర టిప్పర్ ఢీకొన్న ప్రమాదం మరువక ముందే ఇలాంటి సంఘటన మరోటి చోటుచేసుకోవడంతో ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారు.

పంచాయతీ బకాయిలపై ప్రభుత్వం ఆరా



కులకచర్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల 22 నెలల బకాయిలపై ప్రభుత్వం ఆరా తీస్తున్నట్లు సమాచారం. సర్పంచ్‌ల పదవీ కాలం 2023 డిసెంబరులో పూర్తయింది. అప్పటి నుంచి గ్రామాలు ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. పంచాయతీల నిర్వహణ బాధ్యత కార్యదర్శులపై పడింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించక కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. ఇందుకు తోడు రాష్ట్ర ప్రభుత్వం సైతం పెద్దగా నిధులు సమకూర్చలేదు. దీంతో కార్యదర్శులు అప్పు చేసి గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు, ఇతర పనులు చేపట్టారు. గ్రామ జనాభాను బట్టి ఒక్కో కార్యదర్శి రూ.3లక్షల నుంచి 5లక్షల వరకు అప్పు చేసి పనులు చేశారు. ఖర్చుకు సంబంధించి మంజూరు కాని బిల్లుల వివరాలు, పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ, ఇతర పనుల కోసం పంచాయతీ కార్యదర్శులు అప్పుల వివరాలను సేకరిస్తున్నారు. వివరాలతో నివేదికను రూపొందించి ప్రభుత్వానికి నివేదించనున్నారు. కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లో 57గ్రామ పంచాయతీలున్నాయి. కార్యదర్శులు రూ.లక్షల్లో అప్పు చేసి గ్రామాల్లో పనులకు వెచ్చించారు. 22నెలలకు సంబంధించి ప్రతీ పంచాయతీకి రూ.లక్షల్లో రావాల్సి ఉంది. ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో అధికారులు పంపిన వివరాల ఆధారంగా ప్రాధాన్యత క్రమంలో నిధులు విడుదల చేసే అవకాశం ఉంది.

కోళ్ల పందెం.. గుట్టు రట్టు

- రూ.60,950, 4 కార్లు, 13 సెల్‌ఫోన్ల స్వాధీనం



ఫాంహౌస్ కోళ్ల పందెంలో పట్టుబడిన నిందితులు

మొయినాబాద్ రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కోళ్ల పందేలా స్థావరంపై ఎస్వోటీ టీం దాడి చేసి పందెం కోళ్లను, ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్న ఘటన మొయినాబాద్ మండలం బాకారం జాగీర్ గ్రామ సమీపంలోని ఫాంహౌస్‌లో చోటుచేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం బాకారం సమీప ఫాంహౌస్‌లో ఏపీలోని రాజమండ్రి ప్రాంతానికి చెందిన కోళ్ల పందెం నిర్వాహకుడు దాట్ల కృష్ణంరాజు శనివారం రాత్రి కోళ్ల పందెం నిర్వహించాడు. పక్కా సమాచారంతో దాడి చేపి పట్టుకున్నారు. రూ.60,950, నాలుగు కార్లు, 13ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. 22కోళ్లను(15 ప్రాణాలతో, 7చనిపోయినవి) స్వాధీనం చేసుకున్నారు. దాట్ల కృష్ణంరాజుతో పాటు మొత్తం 14 మందిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గతంలో తోలుకట్టలో గల ఓ ఫాంహౌస్‌లో నిర్వహించిన కోళ్ల పందెంలో కృష్ణంరాజు రూ.33 లక్షలు పెట్టినట్టు పోలీసు విచారణలో తేలింది. శనివారం బాకారం జాగీర్ సమీపంలోని కోళ్ల పందెంలోనూ రాజే నిర్వాహకుడిగా తేల్చినట్టు తేలింది. పట్టుబడిన వారిలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వారున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీసీసీలు ఖరారు

(ఐదో పేజీ తరువాయి)

తెలిసింది. స్థానికత అంశంతో పాటు ఐదేళ్ల పార్టీ సీనియార్టీని పరిగణనలోకి తీసుకోవాలని కొందరు సీనియర్లు ఒత్తిడి తీసుకువస్తున్నట్లు సమాచారం. రంగారెడ్డి జిల్లా విషయంలో ఉత్కంఠ మరి కొంత కాలం కొనసాగే అవకాశాలు ఉన్నాయి.

రంగారెడ్డి అధ్యక్ష బరిలో వీరే...

రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్ష పీఠం కోసం అనేక మంది నేతలు పోటీ పడుతున్నారు. నగర శివార్ల నుంచి అంగబలం, అర్థబలం ఉన్న వారు ఎక్కువ మంది ఈ పదవి ఆశిస్తున్నారు. అందులో ప్రధానంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, దీపా భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, సతీశ్, రాజిరెడ్డి, పారిజాత, భీమ్‌భరత్, సిద్దేశ్వర్, ఐలా శ్రీనివాస్‌గౌడ్, బట్టు కిషన్‌రెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి రాచబల్లు వెంకటేశ్వర్లు తదితరులు పోటీ పడుతున్నారు.

ఉపసర్పంచ్‌గా ధారాసింగ్ ప్రస్థానం

వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన ధారాసింగ్ ప్రస్తుతం టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. గిరిజన సామాజిక వర్గానికి చెందిన ఆయన ఉపసర్పంచ్‌గా తన రాజకీయ జీవితం ప్రారంభించారు. అనంతరం పెద్దేముల్ మండలంలో రెండుసార్లు ఎంపీపీగా, ఒకసారి జెడ్పీటీసీగా పనిచేశారు. అలాగే ఎఫ్‌ఏసీఎస్ చైర్మన్‌గా, డీసీఎంఎస్ డైరెక్టర్‌గా సేవలందించారు. ఆయన భార్య తారాబాయి పెద్దేముల్ సర్పంచ్‌గా పనిచేశారు. ధారాసింగ్ ప్రత్యక్ష ఎన్నికల్లో ఎప్పుడు కూడా ఓటమిని చవిచూడలేదు. మొదటి నుంచి క్రమశిక్షణ గల కార్యకర్తగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగారు. గతంలో పార్టీలో డీసీసీ ఉపాధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.

మూడుసార్లు ఎమ్మెల్యేగా పోటీ..

మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్‌కు చెందిన వజ్రేశ్ యాదవ్. 19 అక్టోబర్ 1965లో జన్మించారు. ఆయన పదో వతరగతి వరకు చదువుకున్నాడు. గతంలో బోడుప్పల్ పంచాయితీ ఉపసర్పంచ్‌గా, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పని చేశారు. ఆయన భార్య తోటకూర లక్ష్మి 1997లో బోడుప్పల్ సర్పంచ్‌గా పని చేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్దకుమారుడు అజయ్ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు మేయర్‌గా పని చేశాడు. మేడ్చల్ నుంచి 2009లో దేవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రజారాజ్యం పార్టీ నుంచి, 2014లో టీడీపీ నుంచి, 2023 తిరిగి కాంగ్రెస్ నుంచి మొత్తం మూడు పర్యాయాలు ఆయన ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పటికీ విజయం వరించలేదు.. అయినా ఏమాత్రం వెనకడుగు వేయకుండా నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేస్తున్నాడు. టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా, నియోజకవర్గ ఇన్‌చార్జిగా పని చేస్తున్నారు. మంత్రులను ఒప్పించి నియోజకవర్గంలోని ఆయా మండలాలకు భారీగా నిధులను వెచ్చించి అబివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాడు. తిరిగి ఆయన డీసీసీ అధ్యక్షుడిగి ఎంపిక కావడంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన ఆటల పోటీలు



బహుమతులు అందుకుంటున్న క్రీడాకారులు

మేడ్చల్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గుండ్లపోచంపల్లి కృషిహోమ్స్ వారు రెండు రోజుల పాటు నిర్వహించిన ఆటల పోటీలు శనివారం ముగిసాయి. ఈ ఆటల పోటీల్లో జిల్లాకు చెందిన 26 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 1900మంది క్రీడాకారులు వాలిబాల్, బాస్కెట్ బాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహించారు. విజేతలకు కృషి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్‌రావు, కల్నల్ వీవీ రావు, డైరెక్టర్లు శామ్యూల్‌ల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

బీఆర్ఎస్ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ



బీఆర్ఎస్ నాయకున్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మేడ్చల్ పట్టణ సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు వీరభద్రారెడ్డికి స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి శనివారం పరామర్శించారు. అనారాగ్యం కారణంగా ఇటీవల శస్త్రచికిత్స పొందిన భద్రారెడ్డి ఇంటికి వెళ్లి మంత్రి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు భాస్కర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కొడంగల్ బంద్

కొడంగల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల తరలింపును నిరసిస్తూ సోమవారం(రేపు) కొడంగల్ స్వచ్ఛంద బంద్‌కు పిలుపునిచ్చినట్లు కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ కో కన్వీనర్లు ఎరన్‌పల్లి శ్రీనివాస్, యు.రమేశ్‌బాబు, ఎస్ఎం.గౌసన్, మాసాని వెంకటయ్య తెలిపారు. వారు కొడంగల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. కొడంగల్‌కు మంజూరైన మెడికల్ కళాశాల, గురుకులాల తరలింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు షాకీర్, శాంతికుమార్, కుప్పగిరి సాయిలు, అన్నారం సాయిలు, రవి తదితరులు పాల్గొన్నారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే ధ్యేయం



తాండూరు రూరల్: మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుయ్యాన్ని మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

తాండూరు రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని తాండూర్ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరు ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మహిళా స్త్రీశక్తి ఆధ్వర్యంలో మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తాండూరులో మహిళలు ముందుకు వస్తే పప్పు మిల్లు, రైస్‌మిల్లు మంజూరు చేసేందుకు కృషిచేస్తానని తెలిపారు.మహిళలకు నాసిరకం చీరలు పంపిణీ చేయడంతో పంట పొలాల చుట్టూ అటవీ పందుల రక్షణ కోసం ఉపయోగించుకున్నారన్నారు. ప్రస్తుతం మహిళలకు పంపిణీ చేస్తున్న చీరలు సిరిసిల్లలో తయారు చేయించి నాణ్యమైనవిగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మహిళలకు రూ.5కోట్ల నుంచి రూ.10కోట్ల వరకు వడ్డీలేని రుణాలు అందిస్తుందని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, ఎంపీడీవో విశ్వప్రసాద్, తహసీల్దార్ తారాసింగ్, ఎస్.రవీందర్‌గౌడ్, ఉత్తమ్ చంద్, జర్పీ నాగప్ప, శేఖర్, బాలయ్య, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, విజయ భాస్కర్‌రెడ్డి, నర్సిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

యాలాల: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను శనివారం 31మంది లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, తహసీల్దార్ వెంకటస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్బర్ బాబా పాల్గొన్నారు.

పెద్దేముల్: మండల కేంద్రంలో మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మహిళలకు నాణ్యమైన చీరలను అందజేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, ఏఎంసీ చైర్మన్ అంజయ్య, వైస్‌చైర్మన్ నారాయణరెడ్డి, ప్రత్యేకాధికారి సత్యనారాయణ, ఏపీఎం శివయ్య, మహిళ సమాఖ్య మండల అధ్యక్షురాలు పావని, నాయకులు మహిపాల్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు

నవాబుపేట: మండల కేంద్రంలో శనివారం మహిళలకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గీతా సింగ్, కాంగ్రెస్ నాయకులు తలారి ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరుస్తున్న ఘనత కాంగ్రెస్‌దే



శామీర్‌పేట: పొన్నాల్‌లో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలుయాదవ్



కీసరలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న తోటకూర వజ్రేష్ యాదవ్

శామీర్‌పేట/కీసర, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని పేద, నిరుపేదలకు సొంతింటి కలను నెరవేరుస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలుయాదవ్ అన్నారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీలోని పొన్నాల గ్రామానికి ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేసి లబ్ధిదారు వీరన్నగారి సుజాత నిర్మించిన నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. అదేవిధంగా తూంకుంట మున్సిపల్‌లోని హకీంపేటకు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ శనివారం ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేసి లబ్ధిదారులు నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ ఉపసర్పంచ్ గడ్డం రమేశ్, జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, దోసకాయల వెంకటేశ్, తుంకి రమేశ్, తుంకి భిక్షపతి పాల్గొన్నారు. అదేవిధంగా దమ్మాయిగూడ మున్సిపల్ పరిధి కీసరలోని రుద్రోజి లత ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం శనివారం జరిగింది. మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన వెంట కీసర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోల కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి, జూపల్లి రవీందర్, రామిడి స్వప్న, కృష్ణారెడ్డి, వేంకటేష్, బుచ్చిరెడ్డి, రమేష్ గుప్తా, జంగయ్యయాదవ్, శ్రావణ్ కుమార్ గుప్తా, లక్ష్మణ్ శర్మ, ప్రవీణ్, సాయిలు, రాజు, ముత్యాలు పాల్గొన్నారు.

దుద్యాల్: పేదల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేఖర్ అన్నారు. దుద్యాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శనివారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్యతో కలిసి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీతారాం, కృష్ణ, సత్యనారాయణ, చాంద్‌పాష, శ్రీశైలంగౌడ్, ఖాజ, శివ చౌహన్, సంజీవ్ పాల్గొన్నారు.

శాంతి భద్రతలకే ప్రాధాన్యం

(ఐదో పేజీ తరువాయి)



స్నేహ మెహ్రాకు జిల్లా ఎస్పీ బాధ్యతలు అప్పగిస్తున్న బదిలీపై వెళుతున్న నారాయణరెడ్డి

మరింత పటిష్టం చేస్తానని ఆమె తెలిపారు. కాగా, ఎస్పీగా బాధ్యతలు స్వీకరించేందుకు వచ్చిన స్నేహ మెహ్రాకు అదనపు ఎస్పీ రాములు నాయక్, ఇతర పోలీసు అధికారులు ఘన స్వాగతం పలికారు. మొదట ఆమె సాయుధ పోలీసు దళం నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వికారాబాద్, పరిగి, తాండూరు డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, యాదయ్య, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, డీసీఆర్‌బీ డీఎస్పీ జానయ్య, డీటీసీ డీఎస్పీ శ్రీనివాసులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, జిల్లా పోలీస్ కేంద్ర కార్యాలయం ఉద్యోగులు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు.

కలెక్టర్‌ను కలిసిన స్నేహ మెహ్రా

వికారాబాద్: వికారాబాద్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన స్నేహమెహ్రా జిల్లా కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం సాయంత్రం కలెక్టర్‌కు మొక్కను అందజేశారు.

కలెక్టర్, ఎస్పీని కలిసిన మాజీ చైర్‌పర్సన్

తాండూరు: వికారాబాద్ జిల్లా కొత్త ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన స్నేహా మెహ్రాలను శనివారం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. అంతకుముందు కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి తాండూరులోని పలు సమస్యలపై విన్నవించడంతో పాటు పట్టణంలో జరుగుతున్న అక్రమాలపై కలెక్టర్‌కు విన్నవించారు.



సాయుధ పోలీసు దళం నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ స్నేహ మెహ్రా

వికారాబాద్: కలెక్టర్‌ను కలిసి మొక్కను అందజేస్తున్న ఎస్పీ స్నేహ మెహ్రా →





← వికారాబాద్ జిల్లా ఎస్పీని కలిసిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్న

లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి



తాండూరు: నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

తాండూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌ల అమలుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం తాండూరు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లాప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాస్, సీసీఐ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి శరణప్పలు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించే విధంగా 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చిందని అన్నారు. నవంబర్ 26వ తేదీన సీఐటీయూ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ప్రజావ్యతిరేక విధానానికి వ్యతిరేకంగా నిరసన తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మైనార్టీ హక్కుల పోరాట సమితి నియోజకవర్గ ఇన్‌చార్జి సాదిక్, రాములు, నరేష్ పాల్గొన్నారు.

దుద్యాల్: కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. దుద్యాల్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ కార్మిక నిబంధనలను తుంగలో తొక్కి పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం 29 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను బీజేపీ ప్రభుత్వం తెచ్చిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నవీన్, వెంకటయ్య, బుగ్గప్ప, నరేశ్, ఎల్లమ్మ పాల్గొన్నారు.

శామీర్‌పేట: కేంద్ర ప్రభుత్వం కొత్తగా కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువస్తున్న నాలుగు కోడ్‌లను రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి మొరుగు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. జిల్లా ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం తూంకుంట మున్సిపల్ కార్మికులు శామీర్‌పేటలోని వార్డు కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఐఎఫ్‌టీయూ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొరుగు శ్రీకాంత్, రాష్ట్ర సహాయ నాయకుడు శివబాబు ఆధ్వర్యంలో తూంకుంట మున్సిపల్ కార్మికులు వ్యతిరేకకోడ్‌ల పత్రికలను కాల్చివేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, నాగరాజు, శ్యాం, స్వామి, పోచయ్య, కమలమ్మ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో మెరుగైన వైద్యం

ఘట్‌కేసర్ రూరల్ నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధితో పేదలకు మెరుగైన వైద్యం అందుతోందని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్ అన్నారు. ఘనపురం గ్రామానికి చెందిన ప్రతాప్ రెడ్డికి శనివారం రూ.60వేలు విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆయన శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం బీ బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, ఘనాపురం గ్రామమాజీ ఉపసర్పంచ్ పరమేష్, కాంగ్రెస్ ఘట్‌కేసర్ యూత్ అధ్యక్షుడు సంజీవరెడ్డి పాల్గొన్నారు.

పోస్టాఫీసులో ఆధార్ సేవలు



కొడంగల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోస్టాఫీసులో ఆధార్ సేవలు ప్రారంభించినట్లు సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టు మహబూబ్‌నగర్ డివిజన్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

సంక్షిప్తంగా..

నేడు బీసీకుల సంఘాల సమావేశం

దోమ: మండల కేంద్రంలో ఆదివారం తిరుమల తిరుపతి కల్యాణ మండపంలో బీసీ కుల సంఘాల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు గోవర్ధన్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10:30గంటలకు సమావేశం ఉంటుందని తెలిపారు.

అయ్యప్పస్వాములకు అన్నదానం

కులకచర్ల: అయ్యప్పస్వామి ఆలయంలో స్వాములకు గౌడసంఘం మండల ప్రధాన కార్యదర్శి తిరుమలాపూర్ రాములుగౌడ్ శనివారం అన్నదానం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయనను అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు ఈశ్వరయ్య, చంద్రశేఖర్, అంజి, శివకమార్‌గౌడ్, స్థానికులు శ్రీశైలం, రాజప్ప, బాల్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

శ్రీవిష్ణు,శివాలయంలో భక్తులకు అన్నదానం

శామీర్‌పేట: మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని ఉద్దమర్రిలోని శ్రీవిష్ణు, శివాలయంలో శనివారం దాతలు హెల్త్ అసిస్టెంట్ పద్మావతి, వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు.

జెడ్పీహెచ్ఎస్‌లో స్వయం పరిపాలనా దినోత్సవం

కీసర రూరల్: నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలనా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధికారులు, ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కలెక్టర్‌గా, జిల్లా విద్యాశాఖ అధికారిగా, ప్రధానోపాధ్యాయులుగా, ఉపాధ్యాయులుగా విద్యార్థులు విధులు నిర్వహించారు. తరగతి గదిలో తమతోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రాములు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి వివిధ బాధ్యతల నిర్వహణపై అవగాహన కల్పించుకోవాలన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో పూర్తి స్థాయిలో బోధనా సిబ్బందిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఉపాధ్యాయులుగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బోధనాసిబ్బంది, విద్యార్థులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

స్కావెంజర్లకు పూర్తి వేతనాలు చెల్లించాలి

వికారాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా నియమించబడిన స్కావెంజర్లకు కోతలు లేకుండా జీవో ఎంఎస్ నంబర్ 21 ప్రకారం పూర్తి గౌరవవేతనం చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటరత్నం, ప్రధానకార్యదర్శి ఏ.రాములు డిమాండ్ చేశారు. కలెక్టర్‌ను కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు.

బంట్వారం మండల పరిషత్ కార్యవర్గం ఎన్నిక

బంట్వారం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యవర్గ ఎన్నిక శనివారం మోమిన్‌పేట మండలంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బంట్వారం మండల అధ్యక్షుడిగా రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ గఫ్ఫార్, కోశాధికారిగా వెంకటయ్య, మహిళా అధ్యక్షురాలిగా అనితను ఎన్నుకున్నారు. జిల్లా శాఖ అధ్యక్షులు డాక్టర్. మానుపురి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎజాజ్ అహ్మద్, ఎర్రవల్లి రవి, సి.భీమయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పూతపూసిన బంగారు కడ్డీతో మోసం

- మహిళ ఒంటిపై బంగారం చోరీ

ధారూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పూతపూసిన బంగారు కడ్డీని ఆశచూపి ఓమహిళ ఒంటిపై ఉన్న బంగారాన్ని చోరీ చేసిన ఘటన శనివారం సాయంత్రం ధారూరులో సంతలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన కంది లక్ష్మి ధారూరు సంతకు వచ్చింది. సంతలోని ఓ కల్లు దుకాణం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు ఆమెతో మాటలు కలిపి మోసం చేసినట్లు తెలిసింది. ఆమెను కల్లు దుకాణం వెనుక వైపు తీసికెళ్లి బంగారుపూత పూసిన కడ్డీని ఇచ్చారు. ఈ కడ్డీ తీసుకుని నీ ఒంటిపై ఉన్న బంగారాన్ని ఇవ్వాలని గుర్తుతెలియని వ్యక్తులు కోరారు. కడ్డీని ఆమె చేతిలో పెట్టి ఒంటిపై ఉన్న బంగారు గుండ్లు, చెవి కమ్మలు తీసుకుని దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. లక్ష్మి తేరుకున్నాక కుటుంబసభ్యులకు విషయాన్ని తెలిపింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంతలో విచారణ చేపట్టారు. బాధితురాలు మాత్రం తన వద్ద బంగారు వస్తువులు ఎత్తుకెళ్లారని చెబుతోంది. పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరిపితేనే అసలు విషయం బయటపడే అవకాశం ఉంది.

అక్రమ ఇసుక డంపుల సీజ్

బొంరాస్‌పేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దిమడుగు తండా శివారులో అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంపులను శనివారం రెవెన్యూ అధికారులు సీజ్‌చేశారు. సీజ్‌చేసిన 8 ట్రాక్టర్ల ఇసుకను సోమవారం ఉదయం 11గంటలకు వేలం నిర్వహించనున్నట్లు ఆర్ఐ శిరీష తెలిపారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ అన్నారు. మండలంలోని రేగడిమైలారం గ్రామంలో శనివారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్, కాంగ్రెస్ నాయకులు రాంచంద్రారెడ్డి, వెంకట్రాములుగౌడ్, మల్లికార్జున్, వెంకట్‌రెడ్డి, చంద్రప్ప పాల్గొన్నారు.

యాలాల ఎంపీడీవోగా బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవో శ్రీనిజకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

యాలాల, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి): యాలాల మండల నూతన ఎంపీడీవోగా నాగసాయి శ్రీనిజ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో యాలాల మండల యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీనిజను కలిశారు. వారు ఎంపీడీవోకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

గ్రూప్-1 ర్యాంకర్‌కు సన్మానం



తాండూరులో గ్రూప్ -1 ర్యాంకర్ క్రాంతిని సన్మానిస్తున్న అధ్యాపకులు

తాండూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గ్రూప్-1 ర్యాంకర్ కురవ క్రాంతిని శనివారం అధ్యాపకులు, విద్యార్థులు సన్మానించారు. జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్ నాయక్ పాల్గొని మాట్లాడుతూ.. తాండూరు ప్రాంతం నుంచి గ్రూప్-1 ర్యాంక్ సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు మల్లినాథప్ప, మల్లయ్య, మహేందర్ పాల్గొన్నారు.

ఎంపీ కొండాకు పరామర్శ



ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో బీజేపీ నాయకులు

తాండూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని శనివారం వికారాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు సదానందరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జిల్లా ఎన్నికల కన్వీనర్ టి.బాలేశ్వర్ గుప్తా, జిల్లా ఉపాధ్యక్షులు సుదర్శన్‌గౌడ్, జిల్లా కార్యదర్శి జుంటుపల్లి వెంకట్, తదితరులు పరామర్శించారు. ఇటీవల కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న సందర్భంగా వారు పరామర్శించారు.

రైతులను ఆదుకోవాలి

వికారాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జిల్లాలో కురిసిన వర్షాలతో రైతుల తీవ్రంగా పంటలు నష్టపోయారని వారికి వెంటనే ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని బీజేపీ జిల్లా కన్వీనర్ ప్రహ్లాద్‌రావు కోరారు. జిల్లా, నియోజకవర్గ, మండల పట్టణ నాయకులతో కలిసి శనివారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాదవ రెడ్డి, వడ్లనందు, రమేష్ కుమార్, శివరాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

బొంరాస్‌పేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు గౌరారం గోపాల్ అన్నారు. మండల విద్యాధికారి హరిలాల్‌కు శనివారం వినతి పత్రం అందించారు. మండలంలో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులు ఉన్న పాఠశాలలకు స్కూల్ గ్రాండ్స్ అందించాలన్నారు. అదేవిధంగా ఏకోపాధ్యాయ పాఠశాలలతో పాటు యూపీఎస్ పాఠశాలల్లో విద్యావలంటీర్లను నియమించాలన్నారు. అదేవిధంగా పాఠశాలల్లో పార్ట్-2 పాఠ్యపుస్తకాల కొరతను తీర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రమేశ్, జిల్లా కార్యదర్శి శివరాజ్, ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు షీటీం అవగాహన

దోమ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాదాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పరిగి సబ్‌డివిజన్ షీటీం ఇన్‌చార్జి నర్సిములు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ, పోక్సో చట్టాలు, డయల్ 100, షీటీం 181, సీసీ కెమెరాలు, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, బ్యాకింగ్, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అమర్‌నాథ్, ఉపాధ్యాయులు, షీటీం ప్రతినిధులు సావిత్రి, శోభ పాల్గొన్నారు.